# ఆరు గ్లాసులు

అప్పటికి అరగంట సేపయింది మేము వెళుతున్న రైలు ఆ స్టేషనులో ఆగి, చిన్నప్పటినుంచి రైల్వేస్టేషనంటే నాకున్న ఎలర్జీ వల్లనేమో తలనొప్పికూడా వచ్చేసింది.

ప్లాట్ ఫాం ఎటు చూసినా మహారద్దీగా ఉంది. ప్రయాణికులతోనూ, వారిని సాగనంపడానికి వచ్చిన బంధుమిత్రులతోనూ, కాఫీలూ, పకోడీలూ అమ్మేవాళ్ళతోనూ.

కిటికీ పక్కనే కూచున్న నాపైన ఎండపడుతూ ఉంది. చలికాలం కావడంవల్ల పది గంటలు కావస్తున్నా సూర్యకిరణాలలో తీక్షణత లేదు.

"కాఫీ తీసుకుంటావా?" ఉన్నట్టుండి అడిగారు మావారు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. ఆయన అడిగే ధోరణి ఎప్పుడూ నెగెటివ్ అర్థం వచ్చేలా ఉంటుందని నావాదన. సినిమా చూస్తావా? ఊరికి వెళ్తావా? చీర కొనమంటావా? అని అడిగినట్టు ధ్వనిస్తుంది నాకు.

విసుగ్గా వారివైపు ఒకక్షణం చూసి కావాలన్నట్టు తల ఊపాను.

"నాన్నా... నాకూ కాఫీ కావాలి" అంటూ మా ఐదేళ్ళ బుజ్జిగాడు గోముగా అడిగాడు.

"ఒరేయ్ కాఫీ" అంటూ కేకేశారు మావారు.

"ఎన్నికాఫీల్సార్!" అంటూ వచ్చాడు ఓ పద్నాలుగేళ్ళ కుర్రాడు చేతిలో పొగలు కక్కే కాఫీ గ్లాసులున్న ట్రేతో. నల్లనివాడు పద్మనయనంబుల వాడేకాదు, వత్తయిన వంకీల జుత్తూ, నొక్కులు కలిగిన చక్కటి ముక్కూ నవ్వడంకోసం మినహా మరో ఉపయోగం లేనట్టున్న పెదవులూ, విచ్చుకున్న పెదవుల మధ్య తెల్లటి పలువరసా కలవాడు కూడా అనిపించింది నాకు. మాసిన బూడిద రంగు క్యాంటిన్ యూనిఫాంలో కూడా చూడముచ్చటగా ఉన్నాడు.

మావారు నన్నూ, మా పిల్లల్నీ ఎంచుకున్నట్టు ఒకసారి చూసి "ఆరు కాఫీ లియ్యవోయ్" అన్నారు.

మా అందరికీ కాఫీలు అందిస్తున్నాడు ఆ కుర్రాడు.

"మీ చిన్నతమ్ముడు రమణలా లేదూ ఆ కుర్రాడు" అన్నాను మా వారితో.

"ఛ! నోర్ముయ్!! నీకు పోలికలు తెలిసిచావ్వు" అన్నారు అరకిలో ఆముదం తాగినట్టు మొహం పెట్టి.

ఆ కుర్రాడు ఏ కలవారి అబ్బాయో అయిఉంటే నాకు పోలికలు తెలిసి చచ్చేవి మరి.

కాఫీ గ్లాసులు తెగకాలిపోతున్నాయి. మెల్లగా కాఫీ చప్పరిస్తున్నాం. పక్క కంపార్టుమెంటులో కాఫీలు యివ్వడానికేమో ఆ కుర్రాడు మాయమై పోయాడు.

రైలు కూత పెట్టింది...

మేము కాఫీలు తాగేశాం... ఖాళీ గ్లాసులూ, కాఫీ దబ్బా తీసికెళ్ళడానికి ఆ కుర్రాడు రానేలేదు.

రైలు మెల్లగా కదులుతూ ఉంది.

"ప్లాట్ ఫాం మీద ఎక్కడయినా ఆ కుర్రాడు ఉన్నాడేమో పిలవండీ! గ్లాసులూ, డబ్బా తీసికెళ్ళనీ" అన్నాను మా వారితో.

"వాడే వస్తాడులేవే" అన్నారు తాపీగా.

"రైలు కదుల్తోందిగా?"

"ఈ రైల్లోనే ఎక్కడో ఎక్కేసే ఉంటాడులే... పక్క స్టేషనులో వచ్చి తీసికెళతాడు" అన్నారు దమ్ములాగడానికి సిగరెట్టును పెదవులకానిస్తూ.

❀ ❀ ❀ ❀

హెడ్‌కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వస్తే తిరుపతికి వచ్చి తలనీలాలు ఇచ్చుకుంటానని ఏడుకొండల వాడికి మొక్కుకున్నారు మావారు... అందుకే ఈ ప్రయాణం.

టెలిఫోన్ స్తంభాలూ, చెట్లూ, పొదలూ మాకు వీడ్కోలు చెబుతున్నాయి.

పక్క స్టేషను వచ్చేసింది, రైలాగింది.

అది ఏ స్టేషనో చూడాలన్న కుతూహలం లేదునాలో, కాఫీ కుర్రాడు వస్తాడా? రాడా? అన్న ఆలోచన తప్ప. కంపార్ట్‌మెంటు కిటికీలోంచి తొంగిచూసి వెతుకుతున్నాయి నాకళ్ళు.

"ఏమండీ! ఆ కుర్రాడు వచ్చాడేమో కాస్త వెదక్కూడదూ?" ఆయన బుజాన్ని కుదుపుతూ అన్నాను.

సీరియస్‌గా ఆయన నావైపు చూసి అన్నారు – "వాడు రాకపోతే నీకా, వాడికా నష్టం?"

"వాడికే?" అయోమయంగా నేను.

"మరి! నోరు మూసుకుని ఉండు. ఒకవేళ తీసికెళ్ళకపోతే వాడి ప్రొప్రయిటరుకి లాస్ వచ్చేసి హోటల్ మూసెయ్యడులే! అన్నిటికి పేద్ద ఆందోళన..." గొణుగుతూ ఉన్నారాయన.

పిల్లలు బిక్కు బిక్కుమని చూస్తున్నారు నావేపు. మా పెట్టెలో తక్కిన ప్యాసింజర్లంతా ఉత్తరాది వాళ్ళవడం మూలాన బతికిపోయాను. తెలుగు తెలిసినవాళ్ళే అయితే మా గురించి ఏమనుకునే వాళ్ళో!

రైలు కూత పెట్టింది.

నేను కిటికీ గుండా మరోసారి దృష్టి సారించాను. అంతే - ఉలిక్కిపడ్డాను.

సుమారు రెండు కంపార్టుమెంట్ల అవతల నలుగురు రైల్వే పోలీసుల మధ్య... కాఫీ కుర్రాడు... ఏడుపు మొహంతో మాపెట్టెవేపు వేలు చూపెడుతూ కాఫీ గ్లాసుల సంగతేమో చెబుతున్నాడు. నాకు వినబడ్డంలేదు.

"అదిగో అక్కడున్నాడండీ ఆ కుర్రాడు" మావారికి చూపించాను.

మౌనంగా చూశారు ఆ కుర్రాణ్ణి.

ఎక్కడికైనా పారిపోతాడేమోనని ఒక రైల్వే పోలీసు ఆ కుర్రాడి జబ్బ పట్టుకుని ఉన్నాడు.

"మీరు వెళ్ళి జరిగిన విషయం చెప్పి విడిపించరూ?" అన్నాను.

మౌనంగా నా వైపు చూశాడు. అంత వెధవపని చేయాలా అన్నట్టు.

"నీయమ్మ! దొంగ వెధవా! మీ బాబు సొమ్మా రైల్వే అంటే? పాసు అడిగితే లేదంటావ్, టిక్కెట్టడిగితే లేదంటావ్... దొంగనాకొడకా - ప్లాట్ ఫారం మీద కాఫీ అమ్ముకోనిస్తే ట్రెయిన్లో స్టేషన్ స్టేషనుకూ తిరుగుతావా? పదా నా కొడకా... కొన్నాళ్ళు జైల్లో వుంటే తెలిసొస్తుంది" గట్టిగా ఆ కుర్రాడి మీద కేకలేస్తున్నాడు ఒక పోలీసు.

రైలు ముందుకు సాగడంవల్ల కేకలు వినబడలేదు.

బాగా వేగం పుంజుకుంది రైలు.

"వాడినేం చేస్తారో.. పోలీసులు?" అప్రయత్నంగా, ఆందోళనగా అడిగాను.

"ఆఁ - ఏం చేస్తారు... రైల్వే కోర్టుకు తీసుకెళతారు. కోర్టువారు మూడురోజులు సామాన్య జైలుశిక్ష వేస్తారు. అంతే?" అంటూ తేలిగ్గా చెప్పారు.

ఆయన ఎంత తేలిగ్గా చెప్పినా నా గుండె బరువుగా తయారయింది. మావల్ల ఒక నిరపరాధికి జైలుశిక్ష అన్నది తలుచుకుంటే ఏదో పాపం చేసినట్టు నా మనసు పెనుగులాడుతోంది.

రైలు వేగంగా ముందుకు దూసుకుపోతోంది. నా ఆలోచనలు మాత్రం అంతకంటే వేగంగా వెనక్కి... ఆ కుర్రాడి వైపు వెళుతున్నాయి.

❁ ❁ ❁ ❁

కట్టెలు పచ్చిగా ఉండటంవల్ల పొయ్యి సరిగ్గా మండటంలేదు. ఏటవాలుగా వంటింటి కిటికీలోనుంచి పడుతున్న ఎండ, పొగపొదవును కొలుస్తున్నట్టుంది. కసిగా పొయ్యిని ఊది పెరట్లోకి వచ్చాను. కళ్ళనిండా నీళ్లు వస్తుంటే కొంగుతో వొత్తుకుంటూ.

కోడికోసం చల్లిన నూకలకోసం గావును పిట్టలు కిచకిచమని అరుస్తూ ఏరుకుతింటున్నాయి.

ఎంత అదృష్టం వాటిది, వండని ఆహారం తినగలుగుతున్నాయి! ఈ పచ్చి కట్టెలూ, పొగా, వంటా... ఇవేవి వాటిని బాధించవు. అన్ని జన్మలలోకీ మానవజన్మ ఉత్తమమైనదీ, ఉన్నతమైనదీ నట.

ఆ పిట్టల్ని తినడానికేమో పొంచిపొంచి పోతోంది, మా పెంపుడు పిల్లి. కట్టె తీసుకుని దాన్ని తరిమాను.

"వేణ్ణీళ్ళున్నాయా?" అంటూ బయటి గదిలోంచి కేకేశారు ఆయన.

"అయిదు నిమిషాల్లో..." జవాబుగా తిరిగి కేకేశాను, వంటింట్లోకి అడుగుపెడుతూ.

ఆయన సబ్ జైల్‌గార్డు ఇన్చార్జి డ్యూటీనుంచి వస్తూనే స్నానానికి నీళ్ళు కాగి ఉండాలి. లేకుంటే అశాస్త్రీయ శివతాండవం ప్రదర్శిస్తారు.

"కాఫీ ఉంటే ఇవ్వు... ఎక్కడిదీ ఇంత పొగ? ఎన్నేళ్ళు సంసారం చేసినా పొయ్యి మండించడం రాదు" గొణుగుతున్నారు, ఆయన సొంతబాణీలో.

అపుడెవరైనా మా ఇంట్లోకి వచ్చారంటే ఆయన్ను చూసి హెడ్ కానిస్టేబుల్ అనుకోరు. ఆ చారల లుంగీ, దానిమీద ఎర్రరంగు బనియనూ, అయస్కాంతానికి ఇనుపరజను అతుక్కున్నట్టున్న ఆయన గుండూ చూసి కచ్చితంగా అపార్థం చేసుకుంటారు.

మా వారిని చూసేమో బుద్ధిగా వెలుగుతున్నాయి పొయ్యిలో కట్టెలు.

కాఫీ వేడి చేసేందుకు పొయ్యిమీద పాత్ర ఉంచాను.

"నిన్న సాయంత్రం జైల్లో ఓ తమాషా జరిగిందోయ్" రోలు పక్కనే ఉన్న బియ్యం బస్తాపై కూచుంటూ అన్నారు.

"ఏమిటీ?" యాంత్రికంగానే అడిగాను.

ఆయన 'తమాషా' అని అన్నారా? చెప్పబోయే విషయంలో తమాషా తప్ప తక్కినవన్నీ ఉంటాయి. డ్యూటీ నుంచి ఇంటికొస్తూనే పోలీసుస్టేషను విషయాలో, సబ్ జైలు విశేషాలో చెబుతూ ఉండడం పరిపాటి? అన్నీ వింటున్నట్టు నటించడం, చివర్లో ఆయన నవ్వుతున్నప్పుడు శ్రుతి కలపడం అలవాటు నాకు.

'మొన్న తిరుపతికి వెళ్ళేటప్పుడు ఓ రైల్వే స్టేషన్లో కాఫీ కుర్రాడిని రైల్వే పోలీసులు పట్టుకెళ్ళారు చూడు... గుర్తొచ్చిందా?"

"ఎవరూ... ఆ కాఫీ కుర్రాడా? కనబడ్డాడా? ఎప్పుడూ?" ఆత్రంగా అడిగాను – నాలో యాంత్రికత ఎప్పుడెగిరి పోయిందో ఆ విషయం వింటూనే.

"ఆఁ! వాడే! నిన్న సబ్ జైల్లో చూశాను. పాపం అనిపించి పలకరించా. నా గ్లాసులు మీ దగ్గరే ఉన్నాయి సార్! అని ఇంకేదో అనబోయాడు లమ్డీకొడుకు – నీయమ్మ... చెప్పు దెబ్బలు కావాలా? అన్నా. నోరు మూసుకున్నాడు. పాపం!"

"అయ్యో ఇంకా విడిచి పెట్టలేదా వాణ్ణి! మనం తిరుపతి వెళ్ళొచ్చి కూడా వారం అయిందిగా"

"వాడినంత తొందరగా ఎక్కడొదుల్తారు? కనీసం ఆర్నెల్లయినా శిక్ష పడుతుంది వాడికి."

"ఎందుకూ ఆర్నెలలూ?... మూడు రోజులు శిక్ష వేస్తారని మీరేగా అన్నది."

"అవును... టికెట్‌లేని ప్యాసింజర్లకు ఆ మాత్రమే శిక్ష వేస్తారనుకున్నాను. మరి వాడు సూట్‌కేసు దొంగతనం చేసినట్టు కేసు మోపారు రైల్వే పోలీసులు!"

"అయ్యయ్యో! వాడా పని చేయలేదని మీరయినా చెప్పలేకపోయారా?"

"నేను చెప్పడమేమిటి పార్వతీ! నీకు పిచ్చా ఏమైన? కేసులు దొరక్కపోతే వాళ్ళయినా ఏం చేస్తారు మరి?"

"కేసులు దొరక్కపోతే ఏ కర్మా ఎరుగని వాళ్ళమీదా నేరం మోపడం!! వాడొప్పుకుంటాడా ఆ నేరాన్ని?"

"వాడొప్పుకోనేదేంటి? ఒప్పిస్తారు. గొర్రె నడిగి దేవర చేస్తే అయినట్టే పని... నాలుగు లాఠీ దెబ్బలూ, నాలుగు బూటు దెబ్బలుతగిల్తే వాడూ, వాడి ముత్తాత కూడా ఒప్పుకుంటారు... పోలీసులంటే ఏమనుకున్నావు?" నవ్వుతున్నారాయన గర్వంగా...

నా గొంతు పూడిపోయి మాటలు పెగలలేదు.

ఎదురుగా ఉన్న అల్మారాలోని "ఆరు గ్లాసులూ" నన్ను హేళన చేస్తున్నాయి. నా కళ్ళల్లో నీళ్ళు కమ్ముకోవడం వల్లనేమో వాటి ఆకారాలు చెదిరిపోతున్నాయి.

● *మయూరి వీక్లీ వారు **1985**లో నిర్వహించిన కథల పోటీలో*

*మొదటి బహుమతి పొందిన రచన. **7** మార్చి, **1986** సంచికలో ప్రచురితం.* ●